క్లుప్తంగా

పాఠశాల బాట పట్టిన విద్యార్థులు



పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు గురువారం తలుపులు తెరుచుకున్నాయి. ప్రభుత్వం ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులు ఇచ్చిన విషయం తెలిసిందే. మొదటి రోజు కావడంతో విద్యార్థులు యూనిఫారం ధరించి సంతోషంగా పాఠశాల వైపు అడుగులు వేశారు.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. తొలిరోజు విద్యార్థులు అంతంత మాత్రంగా హాజరయ్యారు. పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యాశాఖ అధికారులు పాఠ్య పుస్తకాలను పాఠశాలల వారిగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది.

అంగన్‌వాడీ బడిబాట



చిన్నారులకు అక్షరాభ్యాసం నేర్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

విడపనకల్లు: చీకలగురికిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం చేపట్టారు. మూడేళ్లపై బడిన పిల్లలకు అక్షరాభ్యాసం చేపట్టారు. మూడేళ్ల పైబడిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, శారద, హేమ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



గుమ్మఘట్టలో పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ-2 రామచంద్ర

గుమ్మఘట్ట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను గురువారం అందజేసినట్లు ఎంఈఓ-2 రామచంద్ర తెలిపారు.11 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 41 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 8,200 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశామన్నారు.70 శాతం పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన వీరాంజనేయులు

కూడేరు: కూడేరు మండల పరిధిలోని శివరాంపేట వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. ఉదిరిపికొండకు చెందిన కురుబ వీరాంజనేయులు బళ్లారిలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామనికి బయలుదేరాడు. శివరాంపేట సమీపంలో మలుపు వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

సాధారణానికి మించి వర్షపాతం



మరువపారుతున్న ముద్దలాపురం చెరువు

కూడేరు: మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సాధారణానికి మించి వర్షపాతం నమోదవుతోంది. దీంతో అన్నదాతలు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మే నెలలో సాధారణ వర్షపాతం 27.6 మిల్లీ మీటర్లు. కాగా ఈ ఏడాది 99.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జూన్ నెలలో సాధారణ వర్షపాతం 39.8 మిల్లీ మీటర్లు. కానీ ఈ నెలలో 15 రోజులు దాటకనే 156.5 మిల్లీ మీటర్లు కురిసినట్లు మండల గణాంకాధికారిణి ఆశా గురువారం తెలిపారు. ఎడతెరిపి లేకుండా, జోరుగా కురుస్తున్న వర్షాలకు ముద్దలాపురం చెరువులోకి నీరు అధికంగా చేరడంతో మరువ పారుతోంది. చెక్‌డ్యాంలు, ఫారం పాండ్లు, డకౌట్ పాండ్లు కూడా వర్షం నీటితో నిండి కళకళలాడుతున్నాయి. ఈ నెల 15 నుంచి వేరుశనగ విత్తుకోవడానికి అదను కావడంతో విత్తనం విత్తేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

శుద్ధ అబద్ధమే!

- అనుమతి లేకుండా ఆర్వో ప్లాంట్లు
- నాణ్యత తనిఖీ చేయని అధికారులు
- ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు
- ఉరవకొండలో బిందె రూ.10 నుంచి రూ.15

ఉరవకొండ: నీరు ప్రాణాధారం. అందుకే శుద్ధ జలాల కోసం ప్రజలు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. ఉరవకొండలో తాగునీటి ఎద్దడి కారణంగా శుద్ధజలాల (ఫిల్టర్ వాటర్)పై ఆధారపడాల్సి వస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఫిల్టర్ వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి రూ.10 నుంచి రూ.15 వెచ్చించి బిందె నీరు కొంటున్నారు. ఇదే అదనుగా వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు నాణ్యతకు తిలోదకాలిచ్చి సంపాదనే ధ్యేయంగా నీటి విక్రయాలు చేస్తున్నారు. పట్టణంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో 192 ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో అన్ని రకాల అనుమతులు పొందిన ప్లాంట్లు 40 శాతమే. ఐఎస్ఐ అనుమతులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు చేయాలి. మూడు నెలలకొక సారి ఉన్నతస్థాయి అధికారులు తనిఖీలు చేయాలి. గడువు ముగిసిన తరువాత దరఖాస్తు చేసుకోవడానికి మళ్లీ రూ.2 లక్షలు ఖర్చవుతుంది. అయితే ఉరవకొండ, పరిసర గ్రామాల్లో చాలామంది బోరు వేసి.. అందులో నీళ్లు పడితే చాలు రూ.2.50 లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఖర్చు చేసి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసేస్తున్నారు. అంతే కాదు క్యాన్లు, ట్యాంకులను శుభ్రం చేయకుండా అలానే నీరు సరఫరా చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

నీటిలో సాయిల్, ఐరన్, యాసిడ్, క్లోరిన్, క్లోరైడ్ వంటి ఆమ్లాలు ఉంటాయి. ఇవి అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో ఉంటే ప్రజారోగ్యానికి ముప్పు. ప్లాంటులో కెమికల్ అనాలసిస్ ల్యాబ్ ఏర్పాటు చేసి.. కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్‌లను నియమించుకోవాలి. వీరు ఫిల్టర్ చేసే ముందే నీటిని పరీక్షించాలి. ఫిల్టర్ అయ్యాక నీటిలోని కాఠిన్యత, లవణాలు, రంగు, రుచి పరీక్షించాకే విక్రయానికి పంపాలి. కానీ ఇవేమీ జరగడం లేదు. బోరు నీటిని ఫిల్టర్ చేశాక వాసన లేకుండా, రుచి తెలియకుండా రసాయనాలు కలుపుతున్నారు. ఫలితంగా మినరల్స్ పూర్తిగా పోతున్నాయి. ఈ నీటిని తాగే జనం రోగ నిరోధక శక్తి తగ్గి, క్యాల్షియం కోల్పోయి మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.



దుమ్ము, ధూళి, నాచు పట్టిన క్యాన్లలో నీరు సరఫరా

చర్యలు చేపడతాం

అనుమతులు పొందకుండా ఆర్వో ప్లాంట్లను నిర్వహిస్తే చర్యలు చేపడతాం. ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తాం. చాలా వాటికి ఐఎస్ఐ అనుమతులు లేవని నా దృష్టికి వచ్చింది. నీటి శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపిస్తాం. నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి. ప్లాంట్లను సీజ్ చేస్తాం.



– జి.వి.సుబ్బరాజు, ఎంపీడీఓ, ఉరవకొండ

వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



వజ్రకరూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి కలిశారు. తాడేపల్లిలోని మాజీ సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతపురం జిల్లాలో పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని వైఎస్ జగన్ ఎమ్మెల్సీకి సూచించారు. పార్టీ అధినేతను కలిసిన వారిలో నియోజకవర్గ నాయకులు తిప్పారెడ్డి, దుద్దేకుంట సూరి, నగేష్ ఉన్నారు.

20న వేలం

బొమ్మనహాళ్: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సామగ్రి, కంప్యూటర్, టెబుళ్లు, కుర్చీలను ఈనెల 20న ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

మలేరియాను నిర్మూలిద్దాం



మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



విడపనకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఉరవకొండ: మలేరియాను నిర్మూలిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి ప్రజలకు సూచించారు. స్థానిక మేజర్ పంచాయతీలోని ఐదు వార్డు సచివాలయాల పరిధిలో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలు చేపట్టారు. ఈసందర్భంగా మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందువల్ల దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి వచ్చే ఫీవర్ సర్వే బృందంకు సహకరించి ఎలాంటి జ్వరం ఉన్నా వారికి వివరాలు తెలియజేయాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

విడపనకల్లు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు పాల్తూరులో సీజనల్ వ్యాధుల నివారణపై ఈఓఆర్డీఓ సత్యబాబు, మలేరియా అధికారి కోదండరామిరెడ్డి అధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని వారు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీ మరింత బలపడాలి

- సమన్వయకర్త తలారి రంగయ్య



మాట్లాడుతున్న పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య, చిత్రంలో నేతలు ఉమా, తిప్పేస్వామి

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మరింత బలపడేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ నేతలు బోయ తిప్పేస్వామి, మాదినేని ఉమా మహేశ్వర నాయుడులతో కలిసి బ్రహ్మసముద్రం మండలం నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ జరిగిన ఫలితాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయన్నారు. ప్రజా తీర్పును ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోవు రోజుల్లో పార్టీని గ్రామాల్లో బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ శాయశక్తులా పనిచేయాలని సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. అయితే ఐదేళ్లు మంచి చేసిన ప్రభుత్వానికి ప్రజలు ఎందుకు వ్యతిరేకంగా ఓటు వేశారన్న దానిపై కూలంకషంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిందని, గ్రామాల్లో జరిగే ప్రతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సర్పంచు, ఎంపీటీసీలు హాజరై అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ఏవైనా లోటు పాట్లు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం ప్రభుత్వ పనులపై ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పనులు చేయించడం మన బాధ్యతని, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ అడ్డురాదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బసవరాజు, సీనియర్ నాయకులు దొణస్వామి, సుధీర్, గంగాధరప్ప, మాజీ ఎంపీపీ మహదేవప్ప పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు శెట్టిగారి మంజునాథ్, రామ్మోహన్, ఎంపీటీసీలు తిప్పేస్వామి, నరసింహులు, నాయకులు గోపాల్‌రెడ్డి, బాదపల్లప్ప, మల్లేశ్, శంకరప్ప, తిమ్మారెడ్డి, ఎర్రిస్వామి, మల్లికార్జున, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి



ఆర్‌ఐ బాలకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బొమ్మనహాళ్: నేమకల్లు, హిర్దేహాళ్ పరిధిలో ఉన్న స్పాంజ్ ఐరన్ కర్మాగార సమీపంలో పొలాల్లో సాగు చేసిన పంటలకు కర్మాగార యజమాన్యం పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సర్మాస్, తాలుకా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, సీపీఐ మండల ఇన్‌చార్జి గౌస్‌పీరా, తాలుకా సీపీఐ తాలుకా కార్యవర్గ సభ్యుడు కోట్రేష్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ బాలకృష్ణకు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్మాగార కాలుష్యంతో సమీపంలోని పంటలు దెబ్బతిని రైతులు ఏటా నష్టపోతున్నారన్నారు. యాజమాన్యం స్పందించి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ గురుస్వామి, రైతు సంఘం నాయకులు నరసింహులు, ప్రశాంత్, చందావుసేన్, రైతులు రామాంజినేయులు, బసవన్‌గౌడ్, మల్లన్న, తిమ్మప్ప, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ ఉత్సవం



అలంకరణలో బాబా మూలవిరాట్

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలతోపాటు తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పారావిశ్వనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి'

గుత్తి రూరల్: గుత్తి పట్టణంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ, మండలంలో లక్షకు పైగా జనాభా ఉందన్నారు. ప్రస్తుతం స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండటంతో నేరాల అదుపు పోలీసులకు తలకు మించిన భారంగా మారిందన్నారు. గుత్తి మున్సిపాలిటీతో పాటు మండలంలో జరిగే నేరాలను దృష్టిలో పెట్టుకుని రూరల్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. రూరల్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల కేసుల పురోగతి వేగవంతంగా ఉండటంతో పాటుగా శాంతిభద్రతలు అదుపులో ఉంటాయన్నారు.

సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు



బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



ఒంటిమిద్ది గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్: అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీలోని ఒంటిమిద్ది గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ అల్లర్లు, గొడవల జోలికెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. ముఖ్యంగా యువత సంయమనంతో ఉండాలని తెలిపారు. అనవసరంగా కేసుల్లో ఇరుక్కుపోతే భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో సీఐ హరినాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిగులుసీట్లకు దరఖాస్తు చేసుకోండి

వజ్రకరూరు: రాగులపాడు గ్రామంలోని ఏపీగిరిజన బాలురగురుకుల పాఠశా లలో మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌బాబు పేర్కొన్నారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో 3 వ తరగతి నుంచి 9 వ తరగతివరకు మిగులుసీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మిగులు సీట్లకు ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు.

ఉగ్రవాదం నిర్మూలించాలి

గుంతకల్లుటౌన్: ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని భజరంగ్‌దళ్ నాయకులు కోరారు. ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడాన్ని జీర్ణించుకోలేని ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్ వద్ద శ్రీవైష్ణవి దేవి ఆలయాన్ని సందర్శించుకుని బస్సులో వస్తున్న హిందువులపై జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర భజరంగ్‌దళ్ సాప్తహిక్ కన్వీనర్ సి.రవి తెలిపారు. భజరంగ్‌దళ్ జాతీయ కమిటీ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేశారు. భజరంగ్‌దళ్ పట్టణ కార్యదర్శి వి.ప్రభాకర్, పట్టణ సేవాప్రముఖ్ బండి మురళి, నాయకులు నారాయణరెడ్డి, మోహన్, నెట్టికంటి, విశ్వనాథ్, రమేష్ పాల్గొన్నారు.

వినాయక నగర్‌లో చోరీ

అనంతపురం: స్థానిక వినాయకనగర్‌లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. వినాయకనగర్‌లో ఉంటున్న చంద్రమోహన్‌రెడ్డి కమలానగర్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం ఉదయం భార్యతో కలసి షాపునకు వెళ్లిపోయారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకొని గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం వచ్చిన చంద్రమోహన్‌రెడ్డి దంపతులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శిక్షణ కేంద్రం పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్/బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు సమీపంలోని సమగ్ర శిక్ష ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని ఏపీసీ వైఖోమ్ నిదియాదేవి గురువారం సందర్శించారు. శిక్షణ కేంద్రంలో కల్పించాల్సిన అదనపు సౌకర్యాలపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ ఏ సౌకర్యాలు కల్పించాలనే అంశంపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. సమగ్ర శిక్ష ఈఈ శంకరయ్య, డీఈ జయరామ్, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంఓ గోపాల్, బుక్కరాయసముద్రం ఎంఈఓ నవీద, అలెస్కో గోవిందరెడ్డి ఉన్నారు.

హెచ్‌ఎం, ఎంఈఓపై ఆగ్రహం

బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏపీసీ నిదియాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా మిషన్ లైఫ్ కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలపై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో స్వయంగా మొక్కలు నాటించారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, ప్రయోగశాలలను పరిశీలించారు. ఆయా తరగతుల్లో విద్యార్థులకు బెంచీలు లేకపోవడంపై పాఠశాల హెచ్‌ఎం బిల్‌కిష్‌బాను, ఎంఈఓ నవీదపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్లలు ఉన్నప్పటికీ పిల్లలను నేల మీద కూర్చోబెట్టడం సరికాదని మందలించారు.



కణేకల్లు క్రాస్ వద్ద బొప్పాయి తోటలో నిలిచిన వరదనీరు



ఓ రైతు పొలంలో వరదనీరు పారుతున్న దృశ్యం

కణేకల్లులో భారీ వర్షం

కణేకల్లు: మండల కేంద్రంతోపాటు కణేకల్లు క్రాస్, యర్రగుంట, ఆలూరు, కె.కొత్తపల్లి తదితర గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. సాయంకాలం 4 గంటల నుండి 5 గంటల వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి వంగలు, వాగులు పొంగి ప్రవహించాయి. రైతుల పొలాల్లో రెండు అడుగుల ఎత్తు మేర వరదనీరు ప్రవహించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఓ వైపు రైతుల్లో ఆనందాన్ని మరో వైపు ఆందోళనను కూడా కల్గిస్తున్నాయి. తోటల్లో ఎక్కువ నీరు నిలిచి తేమశాతం అధికమై పంటలు దెబ్బతింటాయని బొప్పాయి, బీర, దానిమ్మ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలకు ప్రధాన పంట అయిన దానిమ్మకు ఆంత్రోక్నోస్ బ్యాక్టీరియా సోకే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్‌ను అపహరించుకెళుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు. కంబదూరు మండలం వెంకటంపల్లి, కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లి, బోరంపల్లి, ముద్దినాయనపల్లిలో ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్లను దోచుకెళ్లారు. ఆయా ఘటనలపై రైతుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా ఆధారాలతో గురువారం ఉదయం బోరంపల్లి వద్ద కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన చాకలి రాఘవేంద్ర, ఎర్రిస్వామిని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని వారు అంగీకరించారు. వారి నుంచి 150 కిలోల రాగివైర్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.